ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
మంగళవారం 19 ఆగస్టు 2025

ఆక్రమణదారుల కోసం

చెరువుకు గండి!

వైసీపీ నాయకుడి సూచనతో మున్సిపల్ అధికారుల నిర్వాకం



పెద్దచెరువులోకి చొచ్చుకొచ్చిన నిర్మాణాలు



చెరువు కట్టను తవ్వేయడంతో వృథాగా పోతున్న నీళ్లు

పలమనేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా చెరువుల్లో ఆక్రమణలను అధికారులు తొలగిస్తుంటారు.అయితే పలమనేరులో ఆక్రమణదారుల కోసం చెరువుకట్టకే గండి కొట్టారు.పలమనేరుకు ఆనుకొని దాదాపు 80 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వున్న పెద్ద చెరువు వర్షాకాలంలో నిండితే దాదాపు 8నెలల పాటు ఆయకట్టుదారుల వ్యవసాయానికి నీరందించడంతో పాటు పట్టణంలో భూగర్భజలాలు సమృద్ధిగా వుండేందుకు తోడ్పడుతుంది.రెండు దశాబ్దాలుగా పలమనేరు పంచాయితీ స్థాయినుంచి మున్సిపాలిటీ స్థాయికి అటుపిమ్మట రెవెన్యూ డివిజన్ స్థాయికి ఎదగడంతో ఇక్కడ నివేశ స్థలాలకు మంచి గిరాకీ ఏర్పడింది. దీంతో ఈ పెద్దచెరువు కూడా ఆక్రమణదారులకు ఆనవాలంగా మారింది. రాజకీయ నాయకుల వత్తాసుతో ఆక్రమణల గురించి అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో రోజురోజుకూ పెద్దచెరువులో ఆక్రమణలు పెరిగిపోయాయి.వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దచెరువులో కలుస్తున్న మురుగునీటిని మళ్లించే నెపంతో చెరువులో నీరు ప్రతిబంధకంగా వుందని చెరువు కట్టకు పడమరవైపు గండి కొట్టి నీటిని తొలగించారు. అప్పట్లో ఈ విషయం విమర్శల పాలైనా మున్సిపల్ అధికారులు కానీ, ఇరిగేషన్ అధికారులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ పట్టించుకోలేదు. చివరకు కూటమి ప్రభుత్వం రాగానే ఈ చెరువు కట్టకు కొట్టిన గండిని అధికారులు పూడ్చివేశారు. దీంతో ఈ చెరువు క్రమేపీ వర్షపు నీటితో నిండుతూ వచ్చింది. మూడు రోజుల క్రితం 90 శాతం నిండి పోయింది. ఇక కలుజు పారడమే తరువాయి. ఈ పెద్దచెరువు లో రెండు గుండ్లు ఉన్నాయి. ఇందులో చిన్నగుండు మునిగితే అర్థచెరువు నిండిందని, పెద్దగుండు మునిగితే చెరువు పూర్తిగా నిండిపోయిందని ఇక్కడి ప్రజలు అనుకుంటారు. మూడు రోజుల క్రితం ఈ చెరువులోని పెద్దగుండు పూర్తిగా కనిపించకుండా మునిగిపోయింది. దీంతో పట్టణ వాసులు చాన్నాళ్ల తరువాత చెరువు నిండిందని సంబరపడ్డారు. ఆయకట్టుదారులు కూడా వ్యవసాయానికి ఏడాది పాటు లోటుండదని భావించారు. అయితే చెరువు నిండిపోవడం ఆక్రమణదారులకు ఇబ్బందికరంగా మారింది. వారి అక్రమ నిర్మాణాలకు ముంపు సమస్య తలెత్తింది.దీంతో వారు మున్సిపాలిటీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలక పాత్ర పోషించిన నాయకుడిని ఆశ్రయించారు.ఆయన వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడడంతో చెరువులోని నీటిని తొలగించి ఆక్రమణదారులకు ఊరట కలిగించాలని నిర్ణయించారు. వైసీపీ హయాంలో గండి కొట్టిన ప్రదేశంలోనే మళ్లీ మున్సిపల్ అధికారులు రెండు రోజుల క్రితం గండి కొట్టడంతో చెరువులోని నీళ్లు క్రమేపి తగ్గిపోయాయి. దాదాపు పెద్దచెరువులో 3అడుగుల మేర నీరు వృథా అయ్యాయి.ఇదే చెరువు కట్టపై తహసిల్దార్, ఆర్డీవో, ఇరిగేషన్ అధికారులు రోజూ కార్యాలయాలకు వెళ్లొస్తున్నా ఈ విషయాన్ని పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ఐరాల(కాణిపాకం),ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలంటూ సోమవారం రాత్రి సీఎం చంద్రబాబును దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌తో కలసి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయంలో ఈనెల 27 నుంచి సెప్టెంబరు 16వ తేదీవరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం బ్రహ్మోత్సవ వాల్‌పోస్టర్, ఆహ్వాన పత్రికలను సీఎం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని ఆలయ వేదపండితులు ఆశీర్వదించి, శేషవస్త్రాలు, స్వామివారి జ్ఞాపికను అందించారు. ఐరాల జడ్పీటీసీ సుచిత్ర, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఏఈవో ధనంజయ, టీడీపీ మండల అధ్యక్షుడు గంగార పుహరిబాబునాయుడు, పూతలపట్టు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు పాల్గొన్నారు.

ఏరువాక జిల్లా కో-ఆర్డినేటర్ బాధ్యతల స్వీకారం



రామకృష్ణారావు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన జిల్లా ఏరువాక కేంద్ర జిల్లా కో-ఆర్డినేటర్‌గా శాస్త్రవేత ఎ.రామకృష్ణారావు సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సంధ్యారాణి బదిలీపై తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రానికి వెళ్లారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారావు మాట్లాడుతూ.. ప్రతి మంగళ, బుధవారాలు పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టి.. రైతులకు పంటల సాగు, సస్యరక్షణ చర్యలు వివరిస్తామని తెలిపారు.

కాణిపాకంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఐరాల రూరల్ ట్రాన్స్‌కో ఏఈ బి.కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. కాణిపాకం బస్టాండ్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద 11 కేవీ విద్యుత్ లైను తక్కువ ఎత్తులో ఉండటంతో వరసిద్ధుడి భక్తులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని గుర్తించామన్నారు. అందువల్ల ఈ లైను ఎత్తు పెంచడానికి ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కాణిపాకంలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. భక్తులు, స్థానికులు సహకరించాలని కోరారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్



కల్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ అటవీ సరిహద్దులోని సైదుల్లా గుట్ట సమీపంలోని సోమవారం ఉదయం ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. కొంత కాలంగా మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న 16 ఏనుగుల గుంపు నాలుగు రోజులుగా అడవిలోనే ఉంటూ ఆకులు, గడ్డి తింటూ అడవికే పరిమితమయ్యాయి. అయితే శనివారం రాత్రి ఏనుగుల గుంపులోని కొన్ని ఏనుగులు అటవీ సరిహద్దులోని మామిడి చెట్లను ధ్వంసం చేసిన అనంతరం మళ్లీ అడవిలో ఉన్న ఏనుగుల మందలోకి చేరిపోయాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని దేవరకోన, మేఘాలకోన ప్రాంతం కల్లూరు ఘాట్‌రోడ్డుకు సమీపంలో 16 ఏనుగుల గుంపు ఆదివారం ఉదయం నుంచి సోమవారం సాయంత్రం చీకటి పడేవరకు అక్కడే ఉన్నాయి. సోమవారం ఉదయం అటవీ సరిహద్దులోకి వచ్చిన ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించింది. ఉపాధి పథకంలో చేపట్టిన గుంతలోకి దిగిన ఒంటరి ఏనుగు ఘీంకారాలు చేసింది. అటవీ సరిహద్దులో పంటలను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది ఒంటరి ఏనుగు ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. ఇది గమనించిన ఒంటరి ఏనుగు గుంతలో నుంచి బయటకు వచ్చి అడవిలో ఉన్న ఏనుగుల గుంపులోకి చేరిపోయింది. 16 ఏనుగుల గుంపు కల్లూరు ఘాట్ రోడ్డుకు సమీపంలోనే రెండోరోజు తిష్ట వేసినా ఏనుగులు ఉన్న స్థలంలో పెద్ద పెద్ద వృక్షాలు, పొదలు ఉండటంతో రహదారిపై వెళ్లే ప్రజలకు ఏనుగుల గుంపు కనిపించలేదు. దీంతో అటవీశాఖ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అడవిలో ఉన్న ఏనుగుల గుంపు కదలికలను సిబ్బంది గమనిస్తున్నారు. పొలాల వైపు ఏనుగులు రాకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

11 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా స్వీకరణ ● గీత కార్మికులకు రాయితీపై బార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ విజయశేఖర్

చిత్తూరు సిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 11 బార్లకు ఎక్సైజ్ డీసీ విజయశేఖర్, ఈఎస్ శ్రీనివాస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 7, కుప్పం, నగరి, పుంగనూరు, పలమనేరు మునిసిపాలిటీల్లో ఒక్కొక్కటి చొప్పున బార్లను ఏర్పాటు చేయనున్నారు. గీత కార్మికులకు 50 శాతం రాయితీతో చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఒక బార్ కేటాయించారు. ఒక్కో బార్‌కు రూ.5.10లక్షలు దరఖాస్తు రుసుముగా నిర్ణయించారు. ఈ నెల 18 నుంచి 26వ తేది సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. 28వ తేది ఉదయం 8 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో లాటరీ ద్వారా బార్లను కేటాయిస్తారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.ఆన్‌లైన్‌లో https://oc.hpfs project.com ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు వేలూరు రోడ్డులోని దుర్గమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చు. గీత కార్మికుల బార్‌కు రిజర్వేషన్ ప్రకారం జనాభా ప్రాతిపదికన ఈడిగ సామాజిక వర్గానికి చెందిన వారే దరఖాస్తు చేసుకోవాలి.

నేటినుంచి వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్

చిత్తూరు రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):వ్యాధినిరోధక టీకాలు వేయించని ఐదేళ్ల లోపున్న పిల్లల కోసం ఈ నెల19 నుంచి 23తేది వరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా టీకాలు వేయనున్నట్లు డీఐవో హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు వేసుకోకపోవడంద్వారా అనేక రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు.వ్యాక్సిన్లు మిస్ అయిన తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాక్సిన్లు వేయించాలన్నారు.బుధ,శనివారం తప్ప మిగిలిన రోజుల్లో స్థానిక సచివాలయాల్లో వ్యాక్సిన్లు వేసుకోవచ్చునన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా నాగేశ్వరరాజు



బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరరాజు

వెదురుకుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా కార్వేటినగరం మండలం రాజులకండ్రిగకు చెందిన నాగేశ్వరరాజు(తెలుగుదేశం) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో చైర్మన్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ నాగబాబు సమక్షంలో బాధ్యతలు తీసుకున్నారు.

యువకుడి హత్య కేసులో

నిందితులు తండ్రి, అన్న!



నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

యాదమరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి హత్య కేసులో నిందితులుగా హతుడి తండ్రి, అన్నగా తేలింది. వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ ఈశ్వర్ మీడియాకు వివరాలు తెలిపారు. యాదమరి మండలంలోని బోదగుట్టపల్లె పంచాయతీ తొట్టిగాని ఇండ్ల గ్రామానికి చెందిన సదాశివం కుమారుడు విజయ్‌కుమార్ (26) ఇటీవల ఓ పొలంలోని పనసచెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. తొలుత ఆత్మహత్యగా అనిపించినా, తలపై తీవ్రగాయాలు.. పొలంలో రక్తపు మరకలు కనిపించడంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. విచారణలో ఇది హత్య అని తేలింది. ఈ క్రమంలో చంపింది తామేనంటూ విజయకుమార్ తండ్రి సదాశివం, అన్న శివకుమార్ సోమవారం వీఆర్వో సురేష్ ఎదుట లొంగిపోయారు. పోలీసులు విచారించగా, విజయ్‌కుమార్ మద్యానికి అలవాటుపడి అప్పులు చేసి కుటుంబాన్ని ఇబ్బందికి గురిచేసేవాడు. ఎన్నిసార్లు హెచ్చరించినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఘర్షణ జరిగింది. గత సోమవారం ఉదయం కౌలుకు తీసుకున్న రఘునాథరెడ్డి పొలం వద్ద ఈ ముగ్గురి మధ్య వాగ్వాదం తీవ్రరూపం దాల్చింది. ఆ క్రమంలో తండ్రి, అన్న దాడిచేయడంతో విజయ్‌కుమార్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఎవరికీ అనుమానం రాకుండా తామే పనసచెట్టుకు ఉరేసుకున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని సీఐ, ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. ఈ విషయం తెలియడంతో తొట్టిగాని ఇండ్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తిరుమలలో వీఐపీ బ్రేక్ టికెట్లు ఇప్పిస్తామని రూ.90 వేల స్వాహా

తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వీఐపీ బ్రేక్ టికెట్లు ఇప్పిస్తామని మోసం చేసిన ఇద్దరు దళారులపై హైదరాబాద్‌కు చెందిన భక్తుడు టీటీడీ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారు. 12 మందికి దర్శనం ఏర్పాటు చేస్తానని చెప్పి గతేడాది ఆగస్టు 16న వనం నటరాజ నరేంద్రకుమార్, కేఎస్ నటరాజ శర్మ రూ.90వేలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత స్పందించలేదని తెలిపారు. కాగా ఈ ఇద్దరు దళారులు హైదరాబాద్‌లో పలువురిని ఇలాగే మోసం చేస్తున్నారని విజిలెన్స్ విభాగం గుర్తించింది. ఇప్పటికే వీరిపై 12 కేసులు నమోదయ్యాయని తెలిసింది. దీంతో దర్శనం, వసతి కోసం దళారులను ఆశ్రయించవద్దంటూ టీటీడీ మరోమారు భక్తులకు ఒక ప్రకటనలో సోమవారం విజ్ఞప్తి చేసింది. అనుమానస్పదం అనిపిస్తే 0877 2263828 నెంబరు ద్వారా విజిలెన్స్ అధికారులను సంప్రదించాలని సూచించింది.

ద్విచక్ర వాహనం నడిపిన బాలుడి మృతి

● వాహనమిచ్చిన తండ్రిపై కేసు

పుంగనూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఓ తొమ్మిదో తరగతి విద్యార్థి ద్విచక్రవాహనం నడుపుతుం డగా జరిగిన ప్రమాదంలో బాలుడు మృతి చెందగా.. ద్విచక్రవాహనం ఇచ్చిన తండ్రిపై కేసు నమోదు చేసినట్లు పుంగనూరు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. పుంగనూరు మండలం భీమగానిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు రామ్‌చరణ్ (14) ఈనెల 2వ తేదీన ద్విచక్రవాహనం నడుపుతూ మోదుగులపల్లెకు చెందిన సోమశేఖర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. రామ్‌చరణ్ తిరుపతిలో చికిత్స పొందుతూ ఈ నెల 15న మృతి చెందాడు. దీంతో మైనర్‌కు వాహనమిచ్చి ప్రమాదానికి కారకుడైన తండ్రిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రామకృష్ణ హత్య కేసులో నిందితుడిపై పీడీ యాక్ట్

● కడప సెంట్రల్ జైలుకు తరలింపు



వెంకటరమణ

పుంగనూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య కేసులో నిందితుడు కె.వెంకటరమణపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు పుంగనూరు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన శ్రీరాములు కుమారుడు కె.వెంకటరమణ (34) ఈ ఏడాది మార్చి 15వ తేదీన అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రామకృష్ణను వేట కొడవలితో నరికి చంపాడన్నారు. గతంలోనే కేసు నమోదు చేసి రిమాండుకు పంపామని.. అయితే వెంకటరమణ అప్పటికే రెండు కేసుల్లో నిందితుడిగా ఉండటంతో ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదిక పంపారన్నారు.దీంతో అతడిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు వచ్చాయని వివరించారు. దీంతో వెంకటరమణను కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు చెప్పారు.

జిల్లాకు ఎల్లో అలర్ట్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో అల్పపీడనం ఏర్పడింది. ఇది మంగళవారం మధ్యాహ్నానికి తీరం దాటే సూచనలున్నాయని తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారులు వెల్లడించారు.ఈ కారణంగా పలు జిల్లాలతో పాటు చిత్తూరు జిల్లాకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు.మంగళవారం జిల్లా అంతటా భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొన్నారు.

31 మండలాల్లో మోస్తరు వర్షాలు

జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో సోమల మినహా మిగిలిన 31 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా వి.కోటలో 24.8 మి.మీ, అత్యల్పంగా పెనుమూరులో ఒక మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. గుడిపాలలో 24, పెద్దపంజాణిలో 22.2, రామకుప్పంలో 20.8, గంగవరంలో 16.4, పలమనేరులో 14.2, యాదమరిలో 14, శాంతిపురంలో 13.6, విజయపురంలో 13.2, బైరెడ్డిపల్లెలో 11.2, బంగారుపాళ్యంలో 10.2, కార్వేటినగరంలో 9.4, చౌడేపల్లె, పుంగనూరులో 7.2, గుడుపల్లెలో 6.4, తవణంపల్లె, రొంపిచెర్లలో 6.2, చిత్తూరు అర్బన్‌లో 5.8, నింద్రలో 5.4, గంగాధరనెల్లూరులో 5, పూతలపట్టులో 4.6, నగరిలో 4.4, వెదురుకుప్పంలో 4.2, పులిచెర్లలో 4, చిత్తూరు రూరల్, కుప్పం, సదుంలో 3.2, శ్రీరంగరాజపురంలో 2.4, పాలసముద్రం, ఐరాలలో 2.2 మి.మీ వర్షం కురిసింది.

శ్రీవారి సేవలో ప్రముఖులు


గౌతమ్‌రాజు

తిరుమల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, సినీ ప్రముఖుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, సీఎం సోదరి హైమావతి, సినీనటుడు గౌతమ్ రాజు, తెలంగాణ ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఉన్నారు.


ఆదిశేషగిరిరావు, హైమావతి

ఘాట్‌రోడ్డు పనుల పరిశీలన


తిరుమల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఘాట్ రోడ్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఘాట్‌రోడ్డు సుందరీకరణకు, శుభ్రతకు పలు సూచనలు చేశారు.


ఘాట్‌రోడ్డులో ఈవో శ్యామలరావు

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.46 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 86,364
తలనీలాలు సమర్పించినవారు: 30,712



అందాల విందు

ఫొటో అంటే సమాజానికి అద్దం కాదు, అర్థం. దృశ్యానికి ఛాయాచిత్రకారుడు చేసే కవితాత్మక వ్యాఖ్యానం. నమోదయ్యే ఒక చరిత్ర. కూలిన గోడ.. ఆశ్రయమిచ్చే నీడ.. రాలే చినుకు.. పేవ్‌మెంట్‌మీద కునుకు.. విరిసిన పువ్వు.. పసికందు నవ్వు.. కాదేదీ ఫొటోకనర్హం. శేషాచలం ఫొటోగ్రాఫర్లకు ఖజానా. ఆకుపచ్చని అందాలే కాదు.. పాకే పురుగు, ఎగిరే పిట్ట, దూకే జలపాతం.. సమస్తమూ ఛాయాచిత్రవస్తువే. అందుకు సచిత్ర సాక్ష్యమే ఈ ఫొటోలు. చిత్తూరు, తిరుపతి నగరాల్లో, తిరుమల కనుమ దారుల్లో తీసిన ఫొటోలు ఇవి. వాన కురిసే వేళ చిత్రవిచిత్రమైన బుల్లి జీవజాలాన్నీ, పర్యాటక ప్రదేశంలోని జనజీవితాన్నీ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ఫొటోల విందు ఇది..

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు- తిరుపతి/తిరుమల/చిత్తూరు




ఎదురు చూపులు


చీమల వంతెన


నీళ్లొదిలానోచ్!


దిగులు వానలు


పహారా

బుల్లి వింత జీవుల లోకం






లోపల ఏముందో




తడిచిన బతుకులు










స్వామిదే.. భారం!





పార్టీ కో ఆర్డినేటర్‌కు ప్రొటోకాల్ ఎలా పాటిస్తారు?

● కలెక్టర్, ఎస్పీలకు సత్యవేడు ఎమ్మెల్యే ఫిర్యాదు

తిరుపతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ కో ఆర్డినేటర్‌కు ప్రొటోకాల్ ఎలా పాటిస్తారంటూ సస్పెన్షన్‌లో ఉన్న టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతోనూ మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా తాను అభివృద్ధి పనులను ప్రారంభించాక, ప్రభుత్వ కార్యక్రమాలను చేపట్టాక మరొకరు ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా తాను పాల్గొనే కార్యక్రమాల్లో ఎవరైనా పాల్గొనవచ్చు గానీ విడిగా కార్యక్రమాలు చేయడమేమిటని ప్రశ్నించారు. ఇది ప్రొటోకాల్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని ఆరోపించారు. పార్టీ కో ఆర్డినేటర్ ప్రైవేటు కార్యక్రమాలకు హాజరైనా మండల స్థాయి అధికారులు ప్రొటోకాల్ పాటిస్తున్నారని ఆరోపించారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. తన ఫిర్యాదుపై స్పందించకుంటే అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అందరూ భాగస్వాములై నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: సత్యవేడులో టీడీపీ కో ఆర్డినేటర్‌కు పోలీసు విభాగం తరపున ప్రొటోకాల్ ఎలా కల్పిస్తారని ఎమ్మెల్యే ఆదిమూలం ఎస్పీ హర్షవర్ధరాజును కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆయన పెళ్లిళ్లు, ఆలయాలకు వెళుతున్నా మీ పోలీసులు వెంట వెళుతున్నారని చెప్పారు. దీనిపై పరిశీలించి ఎలా చేయాలో అలా చేస్తానని ఎస్పీ చెప్పారు.

ప్రహరీ దూకి.. సీసీ కెమెరాలు పగులకొట్టి

● టీటీడీ సూపరింటెండెంట్ ఇంట్లో చోరీ

● 220 గ్రాముల నగలు, 460 గ్రాముల వెండి వస్తువుల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రహరీ దూకారు. ఆధారాలు దొరక్కుండా సీసీ కెమెరాలు పగులకొట్టారు. టీటీడీ (తిరుమల వైకుంఠం-1) సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఇంట్లో దొంగలు పడి 220 గ్రాముల బంగారు నగలు, 460 గ్రాముల వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. తిరుపతి క్రైం సీఐ ప్రకాష్‌బాబు తెలిపిన ప్రకారం.. తిరుపతి బైరాగిపట్టెడలో నివాసం ఉంటున్న టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఈనెల 14న హైదరాబాదులోని కుమార్తె ఇంటికి కుటుంబంతో కలిసి వెళ్లారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు తిరిగి ఇంటికి రాగా.. తాళాలు పగులకొట్టి ఉన్నాయి. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో అనుమానం వచ్చింది. బీరువాలో చూడగా బంగారు నగలు, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ గిరిధర్, క్రైం సిబ్బంది సంఘటనా స్థలం పరిశీలించారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావుకు సమాచారం ఇచ్చారు. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్, సీఐలు చిన్నపెద్దయ్య, ప్రకాష్‌బాబు, ఐడీ పార్టీలు, వేలి ముద్రల నిపుణులు, డాగ్ స్క్వాడ్‌లు ఇంట్లో పరిశీలించాయి. వేలి ముద్రలు సేకరించారు.

ఇంట్లోనే బీరువా తాళాలు

హైదరాబాదుకు వెళ్లే సమయంలో శ్రీనివాసులు కుటుంబీకులు రెండు బీరువాలకు తాళాలు వేసి అక్కడే ఉంచారు. దీంతో దొంగలు ఆ తాళాలు తీసుకుని బీరువా తలుపులు తీసి 220 గ్రాములు బంగారు నగలు, 460 గ్రాములు వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. ఆ తాళాలూ తమతో పాటే వారు తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు పగులకొట్టినా, వీధిలోని సీసీ కెమెరాల ఆధారంగా క్రైం పోలీసులు ఫుటేజీలను పరిశీలించారు. దొంగలు ఆటోలో వచ్చి.. వెళ్లినట్లు గుర్తించారు. నిందితుల ముఖాలు గుర్తు పట్టినట్లు విశ్వసనీయ సమాచారం. క్రైం పోలీసులు కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.


దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న క్రైం డీఎస్పీ

చూసి వెళతారా? సమస్యలు పరిష్కరిస్తారా?

తిరుపతి (సెంట్రల్), ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేకి ఎందరో జనరల్ మేనేజర్లు వచ్చారు. కొత్తగా బాధ్యతలు చేపట్టాక తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకుంటారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి రైల్వే స్టేషన్‌ను సందర్శిస్తారు. తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య, స్టేషన్‌లో ప్రయాణికుల అవసరాలకు సంబంధించి వివరాలు తెలుసుకుంటారు. సమస్యలు వింటారు. అంతే.. అక్కడితో సరి. ఆ తర్వాత బదిలీపై వెళ్లే సమయంలో.. దక్షిణ మధ్య రైల్వే జీఎంగా చివరి రోజుల్లో మళ్లీ వచ్చి శ్రీవారిని దర్శించుకుని వెళుతున్నారు. ఈ మధ్య కాలంలో సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టడంలేదన్న విమర్శలున్నాయి. తాజాగా దక్షిణ మధ్య రైల్వే జీఎంగా బాధ్యతలు చేపట్టిన సంజయ్ కుమార్ శ్రీవాత్సవ తిరుమలకు వస్తున్నారు. ఈ క్రమంలో గత అధికారుల్లా చూసి వెళతారా? సమస్యలపై స్పందిస్తారా? అన్నది రైల్వే వర్గాలు, ప్రయాణికుల్లో చర్చగా మారింది.

జీఎం సారూ.. ఇవీ సమస్యలు

● రేణిగుంట రైల్వే స్టేషన్ రోడ్డు నెంబరు ఒకటి(ప్లాట్ ఫారం ఒకటి) నుంచి గూడూరు వైపు వెళ్లే రైలు మార్గాన్ని కలుపుతూ చేపట్టవలసిన రైలు మార్గం అనుసంధానం పనులు 20 ఏళ్లగా పూర్తి కాలేదు. దీంతో ప్లాట్‌ఫారాలు ఖాళీ లేక రాత్రి సమయాల్లో పొలిమేర్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. అనుసంధాన పనుల కోసం అప్పట్లో నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంటోంది.

● రేణిగుంటసంత వద్ద ఎల్‌సీ గేటు నెంబరు (112) స్థానంలో అండర్ బ్రిడ్జిల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదు.

● పద్మావతి ఫ్లోర్ మిల్లు ఎదుట వున్న ఎల్‌సీగేటు(109), హీరో హోండా ఎదుట ఉన్న ఎల్‌సీ గేటు(107) వద్ద జరుగుతున్న అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి. ● బుగ్గవీధి నుంచి భగత్ సింగ్ కాలనీ, ఇతర కాలనీల్లోకి అండర్ బ్రిడ్జి నిర్మించాలి.

● తిరుచానూరు రైల్వేస్టేషన్ నిర్మాణాలు ఎప్పటికి పూర్తయి.. ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందో తెలియని పరిస్థితి.

● పడమటి రైల్వేస్టేషన్ వద్ద రేల్ కళ్యాణ్ మండపం నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయి?

● పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా ప్రత్యేక రైళ్లు పెరుగుతున్నా, రైళ్ల నిర్వహణలో నాణ్యతాప్రమాణాలు లేవని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రత్యేక రైళ్లకు పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది.

● మహిళా ఉద్యోగులకు తగిన విశ్రాంతి గదులు ఏర్పాటు చేయలేదు. ● రెండు నెలల కిందటే అప్పగిస్తామని చెప్పినా.. ఇప్పటికీ దక్షిణం వైపు చేపట్టిన నూతన భవనం పనులు పూర్తి కాలేదు.

● రేణిగుంట రైల్వే స్టేషన్‌లో మరో రెండు ప్లాట్ ఫారాల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

● తిరుపతి పడమర రైల్వే స్టేషన్‌లో రైళ్లను పార్కింగ్ చేసి సమస్యను పరిష్కరించే అవకాశమున్నా ఈ దిశగా చర్యలు చేపట్టడంలేదు.



రేపు తిరుపతికి రైల్వే జీఎం

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు సంజయ్ కుమార్ శ్రీవాత్సవ సికింద్రాబాద్‌లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు బయలుదేరి బుధవారం తెల్లవారు జామున 3 గంటలకు రేణిగుంటకు చేరుకుంటారు. అక్కడ నుంచి తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకొని 9.30 గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్‌కు వచ్చి స్టేషన్ దక్షిణం వైపు నిర్మిస్తున్న నూతన భవనాన్ని పరిశీలిస్తారు. 11గంటలకు రేణిగుంటలో బయలుదేరి గుంతకల్లు వరకు విండో తనిఖీలు నిర్వహిస్తారు. గుంతకల్లులో సమీక్షిస్తారు. అదే రోజు రాత్రి 11.30 గంటలకు బయలుదేరి సికింద్రాబాదుకు చేరుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి.

బిహార్‌లో దొంగ ఓట్లపై తిరుపతిలో కాంగ్రెస్ నేతల నిరసన

తిరుపతి(వైద్యం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ ఎన్నికల్లోలాగే బిహార్‌లోనూ దొంగ ఓట్లతో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనికి ఎన్నికల కమిషన్ సహకరిస్తుందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. బిహార్‌లో దొంగ ఓట్ల చోరీ ఆపాలని, బాధ్యులపై చర్యలు చేపట్టాలంటూ ఏఐసీసీ పిలుపు మేరకు తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదుట సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బిహార్‌లో 65 లక్షల దొంగ ఓట్లు నమోదు చేశారన్నారు. ఇకనైనా ప్రజాస్వామ్య బద్ధంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పోరాటం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు రవి, వెంకటేష్‌గౌడ్, రావణ్, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

● అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ అడ్డదారులు తొక్కే భాగంగానే బిహార్‌లో దొంగ ఓట్లకు తెరలేపిందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు విమర్శించారు. ఓట్ చోర్-గద్దీ ఛోడ్ నినాదాలతో నగరంలోని గాంధీరోడ్డులో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ విధానాలతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాంభూపాల్ రెడ్డి, వెంకటనరసింహులు, మురళీకృష్ణ, శివ శంకర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ నేతలతో కలిసి కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

నందమూరి, నారా కుటుంబాలు టీడీపీకి రెండు కళ్లు : శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి సంబంధించి నందమూరి, నారా కుటుంబాలు రెండు కళ్లలాంటివని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సోమవారం తెలిపారు. జోనల్ స్థాయి క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. జూనియర్ ఎన్టీఆర్, లోకేశ్ ఇద్దరూ ఎన్టీఆర్ మనవళ్లేనని, ఒకరు సినిమాల్లో, మరొకరు రాజకీయాల్లో ఉన్నారన్నారు. భవిష్యత్తులో వారిద్దరూ కలిసి రాజకీయాలు చేస్తారని జోస్యం చెప్పారు. వార్ 2 సినిమాను ఆడనివ్వబోమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యల గురించి అడగ్గా అది తన వాయిస్ కాదని ఆయన వివరణ ఇచ్చారని, అయినా కూడా క్షమాపణ చెప్పారన్నారు. ఇదే విషయమై మాజీ మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ జైలుకు వెళ్లే ముందు ఇలాంటి మాటలే వస్తాయని ఎద్దేవా చేశారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో దాదాపు రూ.127కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయని తేలిందని, ప్రభుత్వానికి నివేదిక అందించామని, త్వరలోనే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

పింఛన్ల రద్దుపై పునర్విచారణ

- దివ్యాంగులకు కలెక్టర్ భరోసా
- కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'కొచ్చిన అర్జీల సంఖ్య 324

చిత్తూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తమకు ఇచ్చే సామాజిక భద్రతా పింఛను రద్దు చేస్తామని నోటీసులు ఇవ్వడం దారుణమని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. నోటీసులు అందుకున్న పలువురు దివ్యాంగులు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) హాలు ఎదుట సోమవారం నిరసన తెలిపారు. కొందరికి ఇస్తున్న రూ.15వేల పింఛను రద్దు చేసి.. రూ.6వేలను ఇస్తామని నోటీసులు ఇచ్చారని వాపోయారు. మరికొందరికైతే పింఛను రద్దు చేస్తామని చెప్పారని కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ వెంటనే దివ్యాంగుల వద్దకొచ్చి అర్జీ స్వీకరించారు. నోటీసులపై పునర్విచారణ చేయిస్తామని, అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 324 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. రెవెన్యూకు 223, డీఆర్‌డీఏకు 25, పోలీసుశాఖకు 13, ఎస్ఎస్‌కు 12, విద్యాశాఖకు 5, వ్యవసాయశాఖకు 5, డ్వామా, వయోవృద్ధుల సంక్షేమం, ఆర్టీసీ, గృహ నిర్మాణ, పశు సంవర్ధకశాఖ తదితర శాఖలకు కలిపి 41 అర్జీలు అందాయి. బాధితులనుంచి అర్జీలను కలెక్టర్‌తోపాటు జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడెల్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, కరుణకుమార్ తదితరులు స్వీకరించారు. ప్రధాన అర్జీలిలా ఉన్నాయి.



దివ్యాంగుల నుంచి అర్జీని తీసుకుంటున్న కలెక్టర్



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి తదితరులు

ఆ బండను గ్రానైట్ వ్యాపారులకు ఇవ్వొద్దు

రైతులు పండించిన పంటలను ఒబ్బిడి చేసుకోవడానికి ఉపయోగించుకుంటున్న బండను గ్రానైట్ వ్యాపారులకు ఇవ్వొద్దని వెదురుకుప్పం మండలం కొమ్మర గుంటకు చెందిన రైతులు కోరారు.

పొలాలకు దారి సౌకర్యం కల్పించండి

రైతుల పొలాలకు వెళ్లడానికి దారి సౌకర్యాన్ని కల్పించాలని బంగారుపాళ్యం మండలం మహాసముద్రం గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఖాతా నెంబరు 119-4ఎలో రాజమ్మతోపాటు చాలామంది రైతులకు సంబంధించిన భూములు ఉన్నాయన్నారు. ఈ భూములకు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని దారిగా వాడుకునేవారమని చెప్పారు. ప్రస్తుతం ఈ భూమి ఆక్రమణకు గురవడంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇళ్ల స్థలాలివ్వండి

ఇళ్ల స్థలాలిచ్చి కాలనీ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని గుడిపాల మండలం మండికృష్ణాపురం, పెరుమాళ్లకుప్పం, మాదిగపల్లెవాసులు కోరారు. సర్వే నెంబరు 141లో 0.36 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందన్నారు. దీన్ని ఇళ్లు లేని పేదలకు ఇవ్వాలని విన్నవించారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబు, జిల్లా ఇన్‌చార్జిలు గోవిందు, లోకనాథం కోరారు.

పోలీసులకు 35 అర్జీలు

జిల్లా పాత పోలీసు కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు 35 అర్జీలు అందాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వచ్చిన అర్జీల్లో.. డబ్బు తగాదాలపై 11, భూ తగాదాలపై 10, కుటుంబ తగాదాలపై 5, చీటింగ్‌పై 3, వేధింపులపై 2, ఇంటి తగాదాలపై 2, ఆస్తి తగాదాలపై 2 చొప్పున ఉన్నాయి.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

దోపిడీ కేసుల్లో ముగ్గురి అరెస్టు




నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

నగరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దోపిడీ కేసుల్లో ముగ్గురిని అరెస్టు చేశారు. సీఐ విక్రమ్ తెలిపిన వివరాల మేరకు.. నగరి దళితవాడకు చెందిన సతీష్ (19) తన స్నేహితులైన కరకంఠాపురం దళితవాడకు చెందిన విజయ్‌కుమార్ (20), మండలంలోని వేలావడి దళితవాడకు చెందిన శంకర్ అలియాస్ అజిత్(20)తో కలిసి ముఠాగా ఏర్పడి దోపిడీలకు పాల్పడ్డాడు. ఒక్కో దోపిడీకి ఒక్కో వాడుకునేవాడు. ఈ ముగ్గురినీ సోమవారం ఉదయం నగరి పట్టణంలోని కీళపట్టు వద్ద ఉన్న ఆంజనేయగుడి సమీపంలో అరెస్టు చేశారు. విచారించగా.. 2024లో వీకేఎస్ లేఅవుట్‌లో సిలిండర్, ఫ్యాన్, ల్యాప్‌టాప్, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అదే ఏడాదిలో కశింమిట్ట వద్ద మునీశ్వరస్వామి ఆలయంలో హుండీలో రూ.10,350 దోచుకెళ్లారు. 2025 జూలైలో ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్‌వద్ద రూ.35వేలను దోపిడీ చేశారు. జూలై 28న పూడి రైల్వేస్టేషన్ వద్ద రూ.90వేల విలువైన బైక్, ఆగస్టు 12న ఓజీకుప్పం మార్గంలో బైక్‌పై వెళ్తున్న ఓ వృద్ధుడిని బెదిరించి రూ.200, సెల్‌ఫోన్ లాక్కున్నారు. అదే మార్గంలో మరో వ్యక్తిని బీర్‌బాటిల్‌తో తలపై కొట్టి గాయపరిచారు. నిందితుల వద్ద నుంచి రూ.37,570, బైక్, సిలిండర్, ఫ్యాన్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. సతీష్‌పై నగరి పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే ఎనిమిది కేసులు, తమిళనాడులోని అరక్కోణంలో ఒక కేసు నమోదై ఉందని గుర్తించారు. నిందితులను కోర్టు ఆదేశాలతో రిమాండుకు తరలించారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఎస్ఐ నాయక్, ట్రైనీ ఎస్ఐ మారెప్ప, పోలీసులు లోకనాథం, ఇంద్రకుమార్, గజేంద్ర, సురేష్, నవీన్, సత్య, గోపి, రవి, కదిర్‌వేల్‌లను సీఐ అభినందించారు.

డిజిటల్ విధానంలో విద్యుత్ బిల్లు కట్టడం సులభం: ఈఈ

చిత్తూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లును డిజిటల్ విధానంలో కట్టడం సులభమని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లులో ముద్రించే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లించవచ్చన్నారు. అయినా సుమారు 60 శాతం కన్నా ఎక్కువ మంది ఇంకా బిల్లు చెల్లింపు కౌంటర్ల వద్ద గంటలకొద్దీ క్యూలైన్లలో వేచి ఉంటూ బిల్లులు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా వినియోగదారులు డిజిటల్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ కోరారు.

నెలరోజులు వణికించి బోనుకు చిక్కిన చిరుత



మంగళం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన చిరుత ఎట్టకేలకు సోమవారం బోనుకు చిక్కింది. నెల రోజులుగా వర్సిటీ పరిసర ప్రాంతాల్లో శునకాలను వేటాడుతూ జూపార్కు రోడ్డులో వెళ్లే ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేసింది. దీనిపై స్పందించిన అటవీశాఖ అధికారులు చిరుత సంచరించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించారు. యూనివర్సిటీలో చిరుత సంచరిస్తున్న మూడు ప్రాంతాల్లో మూడు బోన్లను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు వర్సిటీలోని ఆడిటోరియం వద్ద గల అన్నపూర్ణ క్యాంటీన్ వెనుక వైపు ఏర్పాటు చేసిన బోనుకు చిరుత చిక్కింది. దీంతో యూనివర్సిటీ విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుబడ్డ మగ చిరుత వయసు మూడు సంవత్సరాలు ఉంటుందని రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. చిరుతను సురక్షితంగా సుదూర అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు ఆయన తెలిపారు.

చెత్తకు బదులు సరుకులు

- తారకరామనగర్ పంచాయతీలో స్వచ్ఛ రథం ప్రారంభం



స్వచ్ఛ రథంలో చెత్తను సేకరించి తూకం వేస్తున్న డీపీవో సుశీలాదేవి

రేణిగుంట ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రీసైక్లింగ్‌కు ఉపయోగపడే పొడి చెత్త, ఇనుము, పేపర్లు, ప్లాస్టిక్, అట్టపెట్టెలు, బాటిళ్లు తదితరాలు తీసుకుంటారు. తూకంవేసి ఆ విలువ ప్రకారం సరుకులు ఇస్తారు. లేదంటే డబ్బులు చెల్లిస్తారు. దీనికోసం 'స్వచ్ఛరథం'ను జిల్లాలోనే మొదటిసారిగా ప్రయోగాత్మకంగా రేణిగుంట మండలం తారకరామనగర్ పంచాయతీలో సోమవారం సాయంత్రం డీపీవో సుశీలాదేవి ప్రారంభించారు. గతంలో ఇంటింటికి రేషన్ పంపిణీకి వినియోగించిన వాహనాన్ని స్వచ్ఛరథంగా వినియోగిస్తున్నారు. స్థానిక పంచాయతీ నిధుల నుంచి డ్రైవరుకు రూ.25 వేల జీతం చెల్లిస్తారు. షెడ్యూల్ ప్రకారం.. ప్రాంతాలవారీగా స్వచ్ఛ రథం తిరుగుతూ ప్రజల నుంచి చెత్తను సేకరిస్తుంది. స్థానికంగా ఉండే ప్రజలు రోడ్లు, కాలువల్లో, పరిసరాల్లో చెత్త వేయకుండా ఉండేందుకు స్వచ్ఛ రథం పథకాన్ని అమలు చేస్తున్నట్లు డీపీవో తెలిపారు. 'ఈ చెత్త ద్వారా డబ్బు వస్తుందని తెలిస్తే గృహిణులు బయట వేయకుండా, ఒక చోట ఉంచి ఇస్తారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే డ్రైనేజీల్లో చెత్త లేకుండా, ఊరంతా శుభ్రంగా కనిపిస్తుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఈశ్వరమ్మ, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం అధికారి షణ్ముఖరామ్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు, కిషోర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, టీడీపీ బుజ్జి నాయుడు, బాలాజీ, మునిరాజా, వాసు, జైచంద్ర పాల్గొన్నారు.

తలకోన ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న బీఆర్ నాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి); తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంగళవారం ఉదయం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ భూమి పూజ చేశారు. ఈ ఆలయ అభివృద్ధికి టీటీడీ రూ.18 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఏడాదిలోపు ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించామని బీఆర్ నాయుడు తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో సుందరంగా ఈ ఆలయ పునర్నిర్మాణంతో పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే నాని అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు శాంతారావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, తలకోన ఆలయ ట్రస్ట్ చైర్మన్ సోమనాథరెడ్డి, ఈవో రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి భక్తులను మోసగించే వారిపై కేసులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భక్తులను మోసగించే దళారులపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ గోపి హెచ్చరించారు. ముక్కంటి ఆలయం వద్ద దళారులుగా వ్యవహరిస్తూ భక్తులతో మాట్లాడుతున్న ఏడుగురిని ఆయన అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. భక్తులకు మాయమాటలు చెప్పి మోసగించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేశారు.

39,620 మంది చిన్నారులకు 'ఆధార్' లేదు

- నేటినుంచి ఎనిమిది రోజులపాటు రెండు విడతల్లో ప్రత్యేక శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్ర జ్యోతి): జన్మించిన శిశువు నుంచి వృద్ధుల వరకు ఆధార్ తప్పనిసరి. ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలన్న విషయం చాలా మంది తల్లిదండ్రులకు తెలియదు. ఈ కారణంగా జిల్లాలో 39,620 మంది చిన్నారులకు నేటికీ ఆధార్ లేదు. అన్ని సేవలకు ప్రభుత్వాలు ఆధార్ తప్పనిసరి చేయడంతో ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా తొలివిడతలో ఈ నెల 19, 20, 21, 22, 23 తేదీల్లో, రెండో విడతలో 28, 29, 30 తేదీల్లో ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలను 125 కేంద్రాలుగా గుర్తించిన పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నారు. 5-15, 15 ఏళ్లు.. అంతకుమించి వయసున్నవారు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవచ్చు. అలాగే ఈ కేంద్రాల్లో ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకునే అవకాశం కూడా ఉంది. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు ఇప్పటికే ఆధార్ కిట్లను ప్రభుత్వం అందించింది.

బర్త్ సర్టిఫికెట్ల మంజూరులో అలసత్వం

ఆస్పత్రుల్లో ప్రసవం అయ్యాక బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అలసత్వం కనిపిస్తోంది. ఇటువంటి కారణంతోనూ చాలామంది ఆధార్ సేవలకు దూరమవుతున్నారు.

ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లాలో మంగళవారం నుంచి జరగనున్న ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో ఆధార్ లేని చిన్నారులు 39,620 మంది ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది.

- రవికుమార్, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయ అధికారి, చిత్తూరు.

అర్హులైన దివ్యాంగులకు పింఛను అందేలా చూడండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులందరికీ పింఛను అందేలా చూడాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఈ అంశంపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీసీహెచ్ఎస్ పద్మాంజలి, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, జిల్లా సర్వైలెన్స్ అధికారి అనిల్‌కుమార్, ఆర్బీఎస్కే కోఆర్డినేటర్ రవితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సదరం సర్టిఫికెట్లు రాకపోవడంతో దివ్యాంగులకు పింఛను నిలిపేయడానికి గల కారణాలను ఆరాతీశారు. దివ్యాంగుల అర్హతను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు.

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ విజేత చిత్తూరు



చిత్తూరు జట్టు క్రీడాకారిణులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ మహిళల సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ విజేతగా చిత్తూరు జట్టు నిలవగా, ద్వితీయ స్థానంలో అనంతపురం జట్టు నిలిచింది. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో సోమవారం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీలు నిర్వహించారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన కడప, చిత్తూరు మధ్య జట్ల పోరులో...మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్దేశిత ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసింది.శిరీష 50 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 17.2 ఓవర్లలో వికెట్ నష్టానికి లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. 9వికెట్ల తేడాతో గెలుపొందిన చిత్తూరు ట్రోఫీని కైవసం చేసుకుంది. శుభశ్రీ 54 పరుగులు, హంస 23 పరుగులు చేశారు. మొదటి స్థానంలో చిత్తూరు, జట్టు ద్వితీయ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏసీఏ సెలెక్టర్ ధనలక్ష్మి, జోన్ సెలెక్టర్లు రాధిక, వేదవల్లి, నాగమణి, అనూష, హరీషా పాల్గొన్నారు.

తోతాపురి సబ్సిడీ రూ.130 కోట్లు త్వరలో రైతుల ఖాతాలకు జమ

- సమీక్షా సమావేశంలో కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ రూ.130 కోట్లు త్వరలో రైతుల ఖాతాలకు జమ చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో వ్యవసాయ, ఉద్యాన శాఖ మండలస్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు దాదాపు మూడు లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి రకాన్ని గుజ్జు పరిశ్రమలకు మామిడి రైతులు అందించారన్నారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కేజీకి రూ.4 సబ్సిడీ నిధులు త్వరలో రూ.130 కోట్లు రానున్నాయన్నారు. ఈ మొత్తం రైతుల ఖాతాలకే చేరాలని, దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత మండల అధికారులపై ఉందన్నారు. 81,455 మంది రైతుల నుండి 3,75,383 మెట్రిక్ టన్నుల మామిడిని సేకరించామన్నారు. గుజ్జు పరిశ్రమల ద్వారా 49,538 మంది రైతుల నుండి 2,30,518 మెట్రిక్ టన్నుల మామిడిని సేకరించగా, మండీల ద్వారా 31,920 మంది రైతుల నుంచి 1,44,865 టన్నులు సేకరించామన్నారు. ఇందుకు సంబంధించి డేటా ఎంట్రీని రెండ్రోజుల్లోగా రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జులు సంతకాలు చేసిన కాపీలను మండల బృందానికి అందజేయాలన్నారు. ప్రతి షీట్‌పై ఆర్ఎస్‌కే ఇన్‌చార్జి, వీఆర్వో.. సంతకాలు చేయాలని చెప్పారు. మంగళ, బుధవారాల్లో ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి వివరాలను నమోదు చేయాలని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేసీ విద్యాధరి,వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, ఉద్యానశాఖ అధికారి మధుసూదన రెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్, సెరికల్చర్ జేడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రూ.39.29 లక్షల ఆదా

- ఉచిత ప్రయాణ పథకంతో నేటికి 86300మంది మహిళలకు లబ్ధి

చిత్తూరు రూరల్, ఆగస్టు 18(ఆంధ్ర జ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా మూడు రోజుల్లో మహిళలు రూ.39.29 లక్షలు లబ్ధి పొందారు. ఆగస్టు 15న సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించారు. 17వ తేదీ వరకు జిల్లాలో 86300 మంది మహిళలు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించారు.మొత్తం 316 బస్సుల్లో 86300 మంది మహిళలు ఉచితంగా గమ్యస్థానాలకు చేరారు. సోమవారం ఉచిత సర్వీసుల్లో మహిళలు కిక్కిరిసి కన్పించారు. బస్టాండ్లలో రద్దీ వాతావరణం కనిపించింది.



రద్దీగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్



ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళలు

- ఒరిజనల్ కార్డులు తప్పనిసరి

ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం అనుమతించిన ఐదు రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని ఒరిజినల్ చూపించాలి. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఇచ్చిన గుర్తింపు కార్డులు, దివ్యాంగులైతే సదరం సర్టిఫికెట్లను అనుమతిస్తున్నాం. ఈ గుర్తింపు కార్డులన్నీ కూడా ఒరిజినల్ కార్డులే తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుంది. జిరాక్సులు, ఫోన్లలో చూపిస్తే అనుమతించం.అవగాహన వచ్చేవరకు ఫోన్లో, జిరాక్సు చూపించినా అనుమతించాలని చెప్పాం కానీ ఒరిజినల్ కార్డులు తప్పనిసరిగా తీసుకురావాల్సిందే.

- రాము, ఆర్టీసీ డీపీటీవో, చిత్తూరు

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి: జడ్పీ సీఈవో



సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆదేశించారు. సోమవారం డీపీవో సుధాకరరావుతో కలిసి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. తాగునీరు ట్యాంక్‌ల క్లీనింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. డీపీవో మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తలను వేరుచేసి వర్మి కంపోస్టు తయారు చేసి సంపద సృష్టించాలని తెలిపారు. ఎంపీడీవో మోహన మురళి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ క్రీడా పోటీలు ప్రారంభం

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీయూ మైదానంలో సోమవారం అమరావతి చాంపియన్‌షిప్-2025 జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని, రాష్ట్రవ్యాప్తంగా మూడు దశలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లాస్థాయి పోటీలు ముగియగా, జోనల్‌స్థాయి పోటీలు మొదలయ్యాయి. రాయలసీమలోని ఎనిమిది జిల్లాల నుంచి 1,700 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కానున్నారు. ఈ పోటీలను శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. ఎన్డీయే ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి పాఠశాలకూ రూ.30వేలతో క్రీడా సామగ్రి అందజేస్తున్నామన్నారు. క్రీడాకారులు ఆటల్లో రాణించి పతకాలు సాధించాలని శాప్ డైరెక్టర్ రజని కోరారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీ యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, ఏపీ జీబీసీ ఛైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఎస్వీయూ ఎస్ఐ కృష్ణయ్య, డీఎస్‌డీవోలు శశిధర్, బాలాజీ, ఉదయ్, రాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి బాస్కెట్ బాల్, ఖోఖో, పరుగుపందెం, వెయిట్ లిఫ్టింగ్ తదితర పోటీలు జరిగాయి.



క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రమాణం చేస్తున్న రవినాయుడు, రజని, టీడీపీ నేతలు



బాస్కెట్‌బాల్ పోటీలు - పరుగు పందెం - వెయిట్ లిఫ్టింగ్

శ్రీగంధం స్మగ్లింగ్ కేసులో నలుగురి అరెస్టు



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న ఎస్ఐ, పోలీసులు

గుడుపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర శ్రీగంధం స్మగ్లర్లను గుడుపల్లె పోలీసులు సోమవారం అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.20 వేలు విలువైన శ్రీగంధం దుంగలు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు... నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో శ్రీగంధం స్మగ్లింగ్ చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో పోలీసులు రహదారుల్లో నిఘా ఉంచారు. సోమవారం తన సిబ్బందితో గుడుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా వాహనాలను తనిఖీ చేపట్టగా.. తమిళనాడుకు చెందిన గోవిందరాజు, తిరుపతి, రామలింగం, శివశక్తి రెండు ద్విచక్ర వాహనాల్లో గోతం సంచుల్లో శ్రీగంధం దుంగలు తీసుకొస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని వారి వద్ద సంచుల్లో తనిఖీ చేయగా శ్రీగంధం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. వీరు గుడివంక అటవీ ప్రాంతంలో శ్రీగంధం చెట్లను కోసి దుంగలను అంతర్రాష్ట్రాలకు స్మగ్లింగ్ చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, సుమారు.20 వేలు విలువ చేసే శ్రీగంధం దుంగలు, చెట్లను కోయడానికి ఉపయోగించే రంపపు బ్లేడ్‌లు, కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం



నశా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ పార్థసారథి తదితరులు

కుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ భూతం జీవితాలను మింగేస్తుందని కుప్పం డీఎస్పీ పార్థసారథి అన్నారు. కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలలో సోమవారం జాతీయ ర్యాగింగ్ వ్యతిరేక వారం, నశా ముక్త్ భారత్ అభియాన్ సందర్భాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం, మత్తు పదార్థాలను వినియోగించడం చట్టరీత్యా నేర కార్యకలాపాలన్నారు. చట్టపరమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. అప్రమత్తతతో యువత చైతన్యశీలంగా వీటన్నింటికీ దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ తమ కళాశాలలో ర్యాగింగ్ రహిత, మత్తు పదార్థ వినియోగ రహిత వాతావరణాన్ని నెలకొల్పామని సగర్వంగా ప్రకటించారు. దివ్యాంగుల శాఖ జిల్లా సీఆర్వో రాజశేఖర్ నాయుడు విద్యార్థులతో నశా ముక్త్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. దీంతోపాటు ర్యాగింగ్ అంశంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్, గుడుపల్లె ఎస్ఐ డి.శ్రీనివాసులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్, పీఈఎస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీ నాగరాజ్‌కు సన్మానం



బీసీ.నాగరాజ్‌ను సన్మానిస్తున్న బీసీఎన్ విద్యా సంస్థల అధ్యాపకులు

కుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్ అత్యుత్తమ విద్యావేత్త అని.. విద్యారంగంలో అద్భుతమైన ప్రగతి చూపి యువతకు ప్రేరణగా నిలిచారని కుప్పం ఇంజనీరింగ్ కళాశాల, కుప్పం డిగ్రీ కళాశాలల బోధన, బోధనేతర సిబ్బంది అభివర్ణించారు. విద్యారంగంలో గత 25 సంవత్సరాలుగా ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ బీసీ.నాగరాజ్‌కు పారిస్‌లోని థేమ్స్ విశ్వవిద్యాలయంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసిన నేపథ్యంలో వారు సన్మానం చేశారు. ఈ సందర్భంగా కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు మాట్లాడుతూ అసాధారణ ధైర్యం, సంకల్పంతో బీసీ.నాగరాజ్ విద్యారంగంలో అద్భుతమైన ప్రగతి చూపారన్నారు. పారిస్‌లోని థేమ్స్ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ బీసీ.నాగరాజ్‌కు లభించడం, బీసీఎన్ విద్యా సంస్థలకు లభించిన గొప్ప గౌరవంగా అభివర్ణించారు. కార్యక్రమంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎస్.సునీల్ రాజ్, కేఈసీ వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, కేడీసీ ప్రిన్సిపాల్ సుధారాణి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామకుప్పంలో జోరు వాన

రామకుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు జోరు వాన కురిసింది. సాయంత్రం అరగంటసేపు కుండపోత వర్షం కురవడంతో రహదారులై వర్షపునీరు ప్రవహించింది. అనంతరం రాత్రంతా జల్లులు కురుస్తూనే ఉన్నాయి. స్థానిక రామనగర్‌కాలనీలోని ప్రధాన రహదారిలో వర్షపునీరు నిల్వ ఉండటంతో కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త లక్ష్మమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి స్థానిక నేతలతో కలిసి లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పార్టీ తరఫున వారికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, మాజీ సర్పంచ్ పెరుమాళ్, నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రబాబురెడ్డి, మునిరెడ్డి, మురళీమోహన్, గిరిబాబు, వెంకటరమణ, శివరాజ్, ఆంజనేయులు, వెంకటేశ్, అమర్, రామచంద్ర, మణి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

పలమనేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 19న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ టి.కె.స్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఫోన్‌నంబర్ 9959225678 ను సంప్రదించాలని కోరారు.

పీజీఆర్ఎస్ అర్జీలకు తక్షణ పరిష్కారం



పలమనేరులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్ అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని ఆర్డీవో పి.భవాని అధికారులకు సూచించారు. సోమవాం పలమనేరులో ని ఆర్డీవో కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో అర్జీలు స్వీకరించారు. కొన్ని ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఫోన్ ద్వారా డివిజన్‌లోని అధికారులకు సూచనలు చేశారు.

● **సోమల:** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలపై తహసీల్దార్ మధుసూదన్‌కు వినతులు అందించారు. భూ తగాదాలతో గ్రామాల్లో వివాదాలు జరుగుతున్నాయని, పాసుపుస్తకాల్లో భూముల వివరాలు సక్రమంగా నమోదు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అర్జీలు అందజేశారు.

రేపు గుడుపల్లె మండల సమావేశం

గుడుపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఈనెల 20వ తేదీన ఉదయం 10.30 గంటలకు గుడుపల్లె మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాధాకృష్ణ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు తప్పక హాజరు కావాలని కోరారు.

చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రాభివృద్ధి



సోమలలో మాట్లాడుతున్న హరిప్రసాద్

సోమల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం అభివృద్ధి పరుగులు తీస్తోందని రాష్ట్ర హస్తకళ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని సూరయ్యగారిపల్లె, సోమల పంచాయతీల్లో జనసేన పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులందరికీ అందేలా నాయకులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోలా సోమశేఖర్, కీర్తి, రమణయ్య, సోమల ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణం రాయల్, ఐడీసీ మాజీ డైరెక్టర్ వై.సాంబయ్య, కైవారం మురళీ, అభిషేక్, ఛాను, రామకృష్ణ, విశ్వనాథం, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నిర్మాణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం కంగుంది కోట వద్ద మహర్షి వాల్మీకి దేవాలయం నిర్మాణానికి వాల్మీకి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, టీడీపీ కుప్పం మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ రూ.లక్ష విరాళం అందించారు. నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సోమవారం ఆయన దర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ వెయ్యేళ్ల చరిత్ర కలిగిన కంగుంది దుర్గాన్ని వాల్మీకి వంశస్తులు పాలించారని చెప్పారు. వారి గుర్తుగా మహర్షి వాల్మీకి దేవాలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 7న వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంక్షేమ సంఘం నాయకులు గణేశ్, అశ్వత్, వెంకటాచలం, రమేశ్, యువరాజు, సూరి, వెంకటస్వామి, విజయ్, బాలకృష్ణ, ప్రభాకర్, టీడీపీ నాయకుడు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సుదర్శన్



కుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ సుదర్శన్ ఎన్నికయ్యారు. 2025-2026 సంవత్సరానికిగాను కుప్పం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆ సంస్థ సలహాదారు మహేశ్ అధ్యక్షతన సోమవారం ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ కార్యదర్శిగా శివ తేవర్, కోశాధికారిగా లెనిన్ బాబు, మొదటి ఉపాధ్యక్షుడిగా సెల్వం, రెండో ఉపాధ్యక్షుడిగా శిరీషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గాన్ని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆమోదించినట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు.

ప్రజారోగ్యం కోసమే టాటా నెర్వ్ సెంటర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు

కుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ఆలోచిస్తున్నారని ఎమ్మెల్సీ, కడా రాజకీయ సలహా మండలి అధ్యక్షుడు కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం మండల సచివాలయంలోని హాలులో సోమవారం కడా ఆధ్వర్యంలో ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటైన టాటా నెర్వ్ సెంటర్‌పై వైద్యాధికారులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రితోపాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాలలోని ప్రధాన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సైతం టాటా నెర్వ్ సెంటర్ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వీరు ఆయా ఆస్పత్రులకు వచ్చే ప్రజల హెల్త్ చార్ట్ డిజిటలైజ్ చేస్తారన్నారు. వారికి ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది సహకరించాలని కోరారు. డిజిటల్ ఆరోగ్య సమాచారంతో దేశంలో ఎక్కడికి ఏ అనారోగ్యంతో కుప్పం ప్రజలు వెళ్లినా, అక్కడ వారి ఆరోగ్య చరిత్రను అధ్యయనం చేసి అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స అందించే సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు, కడా సలహా మండలి సభ్యుడు రాజ్ కుమార్, ప్రభుత్వ వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది, టాటా నెర్వ్ సెంటర్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ పాలకవర్గానికి 13 దరఖాస్తులు



ఈవోకు దరఖాస్తులను అందిస్తున్న లక్ష్మీపతిరాజు, వెంకటరమణరాజు, మనోహర్

చౌడేపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ పాలకవర్గం సభ్యుడిగా టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మీపతిరాజు (పతిరాజు) దరఖాస్తు చేశారు. సోమవారం ఆయన మాజీ ఇన్‌చార్జి వెంకటరమణరాజు, కూటమి నాయకులతో కలిసి పాలకవర్గం సభ్యుడిగా ఆలయ ఈవో ఏకాంబరానికి దరఖాస్తు అందించారు. ఆయనతోపాటు బీజేపీ మండలాధ్యక్షులు కడియాల మనోహర్, మరో 12 మంది సభ్యులు సైతం దరఖాస్తు చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ పగడాల హరిప్రసాద్, టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, కుమార్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, కార్తీక్, సాగర్, ప్రకాష్, సుబ్రహ్మణ్యంరాజు, అడ్వకేట్ వెంకటముని, బీజేపీ నాయకులు కిరణ్‌రాయల్, ప్రవీణ్, నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు

రామకుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పోడుచేను గ్రామంలో గంజాయి విక్రేతతోపాటు ఇద్దరు కొనుగోలుదార్లను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 35 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వెంకటమోహన్ కథనం మేరకు... పోడుచేను గ్రామానికి చెందిన తిరుపతి (49) గత కొంతకాలంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నాడు. ఉదయం 11 గంటలకు పోలీసులు పోడుచేనుకు చేరుకొని తిరుపతి ఇంటిపై దాడి చేశారు. దాడిలో ఇంట్లోని 35 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని తిరుపతితోపాటు గంజాయి కొనుగోలు కోసం వచ్చిన తమిళనాడు రాష్ట్రం వాణియంబాడి తాలూకా లలైరి గ్రామానికి చెందిన విమల్‌పన్నీర్‌సెల్వం (30), విష్ణు యువరాజ్ (22)లను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పూజలు



ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కి స్వాగతం పలుకుతున్న అర్చకులు

శాంతిపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు కోదండరామస్వామి ఆలయం పునర్నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకారంత్ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. రూ.7.85 కోట్లతో ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉదయ్ కుమార్, జనార్ధనరెడ్డి, ఆర్ఎస్ మణి, చంద్ర, రమేష్, నాగరాజు, హరినాథ్ రెడ్డి, జయరామిరెడ్డి, శ్రీనివాసులు, గిరిధర్, లోకేష్, జయరాజు, నాగరాజు, రాజేంద్ర, బసవరాజు, చలపతి, శ్యామలమ్మ, సుగుణమ్మ, వెంకటేష్ తదిరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బాలుర వసతి గృహానికి విద్యార్థులు



సోమల బాలుర వసతిగృహంలో చేరిన విద్యార్థులు

సోమల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సోమల బాలుర వసతి గృహంలో 20 మంది విద్యార్థులు సోమవారం చేరినట్లు హెచ్‌ఎం హేమసుధాకర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చొరవతో సోమలలో గత ఐదేళ్లగా నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహాన్ని బాలుర వసతి గృహంగా ఇటీవల మార్పు చేశారు. దీంతో విద్యార్థులను చేర్పించినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు.

విద్యుత్ తీగల స్వాధీనం



సోమల సబ్‌స్టేషన్ వద్ద స్వాధీనం చేసుకున్న విద్యుత్ తీగలు

సోమల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అడవి పందులను వేటాడానికి కొందరు దుండగులు అటవీ శివారు పొలాల వద్ద అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. సోమవారం సోమలకు చెందిన సోమశేఖర్ తమ పశువులను కుప్పకొండ వైపు మేత కోసం తీసుకెళుతుండగా అక్రమంగా రెండు కిలోమీటర్ల పొడవున విద్యుత్తు తీగలు ఏర్పాటు చేసి ఉండటం గుర్తించాడు. పశువులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అడవికి పోకుండా తిరుగుముఖం పట్టాడు. దీంతో సమీప పొలాల రైతులు శంకర్, మదన్‌మోహన్, మురళీకృష్ణ తదితరులు విద్యుత్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమంగా తీసిన విద్యుత్ తీగలను స్వాధీనం చేసుకున్నారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వ కృషి

రామకుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం మండల సమాఖ్య కార్యాలయం సమావేశ మందిరంలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడి శిక్షణ తీరును తెలుసుకున్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు కందూరు విద్యార్థి



విద్యార్థి దస్తగిరి

సోమల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కందూరు విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి దస్తగిరి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రాజారెడ్డి తెలిపారు. ఈనెల 14న చిత్తూరులో జిల్లా జట్టుకు ఎంపికై. 18న విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో దస్తగిరి విశేష ప్రతిభ కనబరిచాడు. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 28, 29 తేదీల్లో పూణేలో జరగబోవు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

జనసేన కోసం సైనికుల్లా పని చేయాలి



జనసేన జెండా ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

పుంగనూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని పటిష్ఠం చేసేందుకు పార్టీశ్రేణులు సైనికుల్లా పని చేయాలని రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్, ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం పుంగనూరు తూర్పుమొగసాలలో జనసేన జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఓ ప్రైవేటు మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఇప్పటికే ఐదు హామీలను అమలు చేస్తోందని, మిగిలిన ఒక హామీని కూడా ప్రభుత్వం త్వరలోనే అమలు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు గంగారపు రాందాస్ చౌదరి, సింగిల్‌విండో ఛైర్మన్ పగడాల రమణ, కోలా సోమశేఖర్, చిన్నరాయల్, చైతన్యరాయల్, నరేష్‌రాయల్, సుబ్రహ్మణ్యం, వికాష్, భూషణం, రవి, నందు, కుమార్, మదనపల్లె ఏఎంసీ ఛైర్మన్ శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కోలాహలంగా కావళ్ల పండుగ



వీపుతేరు లాక్కొస్తున్న భక్తుడు

రామకుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం కావళ్ల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలువురు భక్తులు కావళ్లతోపాటు వీపునకు కొక్కీలు తగిలించుకొని వీపుతేర్లు లాగారు. మరికొందరు శరీరాలకు సూదులు, దవడలకు శూలాలు గుచ్చుకుని భక్తిని చాటుకున్నారు. సాయంత్రం రామకుప్పంలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బోయకొండలో ఆధ్యాత్మికత పెంపొందించాలి

చౌడేపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో ఆధ్యాత్మికత పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ పేర్కొన్నారు. సోమవారం నూతన పాలకవర్గం సభ్యులుగా బీజేపీ మండలాధ్యక్షులు కడియాల మనోహర్ దరఖాస్తు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్

- ప్రమాదంలో పది మందికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

పుంగనూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలో సోమవారం ఆటోను టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో పది మంది తీవ్రంగా గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం పెద్దయలగటూరుకు చెందిన గంగిరెడ్డి(40), చిన్నపాపమ్మ(60), సంపూర్ణమ్మ(47), జస్విక(3), రత్నమ్మ(40), ఉదయకుమారి(28), వెంకటప్ప(65), లక్ష్మమ్మ(60)నాగవేణమ్మ(65), చిన్నపాపమ్మ(45), డ్రైవర్ రమేశ్‌బాబు(30)లు పుంగనూరుకు సొంత పనులపై వచ్చారు. బస్సులు లేకపోవడంతో ఆటోలో స్వగ్రామమైన పెద్దయలగటూరుకు వెళుతుండగా బైరెడ్డిపల్లె మార్గంలోని మాదనపల్లె క్రాస్ రోడ్డులో టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో గంగిరెడ్డి కాలు విరిగిపోగా మిగిలిన వారందరూ తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనలో గాయపడిన వారిని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గంగిరెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తరలించినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించండి: కమిషనర్



అర్జీని పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం తొమ్మిది అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. ఇంజనీరింగ్‌శాఖకు 3, రెవెన్యూకు 3, హెల్త్, అకౌంట్స్, ప్లానింగ్‌కు సంబంధించి ఒక్కో అర్జీ చొప్పున ఉన్నాయి. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజావరోహణం

● ముగిసిన కుమారగిరి ఆడికృత్తిక ఉత్సవాలు





సారె తీసుకొస్తున్న చింతతోపు ఎస్టీకాలనీ వాసులు - దేవేరులతో సుబ్రహ్మణ్యస్వామి

వెదురుకుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం కుమారగిరి కొండపై ఉన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం ధ్వజావరోహణం వైభవంగా జరిగింది. దీంతో ఆడికృత్తిక ఉత్సవాలు ముగిశాయి. వేకువ జామున నిత్య కైంకర్యాలు పూర్తయ్యాక స్వామివారిని సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వేదపండితుల మంత్రాల నడుమ ధ్వజావరోహణం జరిగింది. కాగా, ఆనవాయితీ ప్రకారం చింతతోపు ఎస్టీకాలనీవాసులు సారెను సమర్పించారు. రాత్రి స్కంధపుష్కరిణిలోని తెప్పపై ఉభయ దేవేరులతో కలిసి సుబ్రహ్మణ్యస్వామి ఏడు చుట్లు విహరించారు. ఈవో కృష్ణనాయక్, నాయకులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

● పింఛన్లు రద్దయిన బాధితుల వినతి





కేశవులురెడ్డి - శివాజి

పెనుమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తమ పరిస్థితిపై విచారించి.. న్యాయం చేయాలని పింఛన్లు రద్దయిన బాధితులు విన్నవించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. శాతంబాకం పంచాయతీ ఎస్.రామాపురానికి చెందిన కె.శివాజీకి పక్షవాతం వచ్చి ఓ చెయ్యి పూర్తిగా పడిపోయింది. వైద్యులు పరీక్షించి 50 శాతం అంగవైకల్యమని సర్టిఫికెట్ ఇచ్చారు. దాంతో దివ్యాంగ పింఛను తీసుకుంటూ కాలం గడుపుతున్నాడు. ఇపుడా పింఛను రద్దు చేయడంతో సోమవారం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి అధికారులను వేడుకున్నాడు. అలాగే ఉగ్రాణంపల్లెకు చెందిన కేశవులురెడ్డికి రెండుసార్లు గుండె ఆపరేషన్ జరగడంతో పింఛను తీసుకుంటున్నాడు. ఇతడి పింఛనూ రద్దయ్యింది. వీరిలాగే చాలా మంది ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఉచిత బస్సు పథకంపై రోజా విమర్శలు మానుకోవాలి: టీడీపీ

నగరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు (స్త్రీ శక్తి) పథకంపై మాజీ మంత్రి రోజా విమర్శలు చేయడం మానుకోవాలని టీడీపీ నాయకులు చలపతి, లత డిమాండ్ చేశారు. రాష్ట్రమంతా మహిళలు మెచ్చుకోవడం కన్పించలేదా అని ప్రశ్నించారు.

'అన్నదాత సుఖీభవ'పై నిర్లక్ష్యమెందుకు?

● వీఆర్వోలపై ఆర్డీవో మండిపాటు



వీఆర్వోలకు సూచనలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

గుడిపాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ఎందుకింత నిర్లక్ష్యంగా ఉన్నారంటూ వీఆర్వోలపై ఆర్డీవో శ్రీనివాసులు మండిపడ్డారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. మండలంలో అర్హులైన కొందరు రైతులకు పథకం ఎందుకు వర్తింపజేయలేదని ప్రశ్నించారు. అర్హులైన వారికి సమస్యలుంటే సరిదిద్దాల్సిన బాధ్యత మీపై ఉందని స్పష్టం చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన రీసర్వేపై ఆరా తీశారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ వెంకట్రామన్, సర్వేయర్ గోపీనాథ్, రీసర్వే సర్వేయర్ రూపాదేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

'అక్షరాంధ్ర'పై అవగాహన



సమావేశంలో ప్రసంగిస్తున్న గండేశ్వరరావు

యాదమరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): 'ఉల్లాస్ - అక్షరాంధ్ర' కార్యక్రమంపై సోమవారం యాదమరి మండలంలోని సమాఖ్య కార్యాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా వయోజన విద్య పర్యవేక్షకుడు గండేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వలంటీర్లకు ఏపీఎం ఈశ్వరి, సిబ్బంది అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో నిర్వహించిన సర్వేలో 5783 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు తెలిపారు. 2029 నాటికి మండలంలో వంద శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యమన్నారు.

ఉప ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు



మోర్దానపల్లె ఉప ఆరోగ్య కేంద్రం వద్ద అధికారుల బృందం

యాదమరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మోర్దానపల్లె ఉప ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం సోమవారం తనిఖీ చేసింది. వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన తనిఖీలో జిల్లా గణాంకాల అధికారి జార్జ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీపతి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుని ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు గుంటూరు చెందిన సీహెచ్‌వీకేరామమూర్తి సోమవారం సాయంత్రం రూ.లక్ష విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

భార్య గొంతుకోసిన భర్త అరెస్టు

బంగారుపాళ్యం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కొదలమడుగు బీసీ కాలనీలో ఈనెల 16వ తేదీన భార్యను గొంతు కోసి హత్య చేసిన భర్త హరిబాబును అరెస్టు చేశారు. సోమవారం ఉదయం మొగిలిలోని ఓ కల్యాణ మండపం వద్ద నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీఐవెంట ట్రైనీ ఎస్ఐ అశోక్ కుమార్, ఏఎస్ఐ మల్లప్ప, సిబ్బంది ఉన్నారు.

16 మంది పింఛన్ల రద్దు

పాలసముద్రం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలో 16 మంది అనర్హులకు పింఛన్లు రద్దు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి తెలిపారు. మరోవైపు బోగస్ దివ్యాంగుల సర్టిఫికెట్లతో రూ.15వేల పింఛను పొందుతున్న వారిని తిరిగి సదరన్‌కు పరీక్షలకు పంపించామన్నారు. వీరిలో 24 మందికి అంగవైకల్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు వివరించారు. ఈ 24 మందికి రూ.15వేలకు బదులు రూ.6వేల పింఛను నెలకు పంపిణీ చేస్తామని తెలియజేశారు.

చెరువులో నీరున్నా పొలాలకెళ్లే దారేది?

తూము వద్ద ఇనుప గేటు మరమ్మతులకు గురవడమే కారణమంటున్న రైతులు





నిండు కుండలా కోసలనగరం చెరువు - మరమ్మతులకు గురైన ఇనుప గేటు

విజయపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోసలనగరం చెరువు నిండు కుండలా ఉంది. అయినా దానికింద ఉన్న పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు తూములో నీరు వెలుపలకు వదలడానికి ఏర్పాటు చేసిన ఇనుప రాడ్డు మరమ్మతుకు గురవడంతో నీరు బయటకు రావడం లేదు. దీనివల్లే గత ఏడాదిలోనూ నీరు వృథాగా ఉండిపోయింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేద్దాం : ఎమ్మెల్యే జగన్మోహన్



ఎమ్మెల్యే జగన్మోహన్‌ను సన్మానిస్తున్న చిత్తూరు ఏఎంసీ సభ్యులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతికి కృషి చేద్దామని చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) సభ్యులకు ఎమ్మెల్యే, కమిటీ గౌరవాధ్యక్షుడు గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. నూతన చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, వైస్ చైర్‌పర్సన్ అనురాధ, సభ్యులు సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేసి, అమలు చేయాలని చెప్పారు. కమిటీ సభ్యులు సి.రామమూర్తి, ఏజీ నాయుడు, జి.రవి, ఎం.నందిని, వి.నాగరాజన్, కేబీ జయపాలన్, సయ్యద్ ఫిరోజ్, ఎంజీ హేమచంద్ర, ఎ.అంజలి, ఎం.మీనాక్షి, కె.గౌరి, ఇ.గోవిందస్వామినాయుడు, ఎ.మోహన్‌నాయుడు, టీడీపీ నేత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు మొరవ ఆక్రమణ



దొరచెరువు మొరవలో నాటిన మామిడి చెట్లు

బంగారుపాళ్యం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దొరచెరువు మొరవను ఆక్రమించి.. చదును చేసి మొగిలికి చెందిన ఏకాంబరం నాయుడు మామిడి చెట్లు నాటేశాడని స్థానికులు తెలిపారు. అలాగే జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో గృహ నిర్మాణాలు చేపట్టాడన్నారు. గతంలో చెరువు మొరవను చదును చేస్తుండగా రెవెన్యూవారు అడ్డుకున్నారని చెప్పారు. వారం కిందట మొరవలో మామిడి మొక్కలు నాటేశాడని చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించండి

పాలసముద్రం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీజీఆర్ఎస్ ద్వారా అర్జీలను పరిశీలించి, సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ అరుణకుమారి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు. రీ సర్వే సందర్భంగా రైతుల పాసు పుస్తకాలలో దొర్లిన తప్పులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. డీటీ రుషివర్మ పాల్గొన్నారు.

నందీశ్వరుడికి రుద్రాభిషేకం





ఆవుదేవర నందీశ్వరుడు - సిద్ధేశ్వరుడు

వెదురుకుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకాన్ని సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

సిద్ధేశ్వరుడికి క్షీరాభిషేకం: ఎగువ కన్నికాపురం వద్ద ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.

బాలాలయంలో పులిగుండు శివపార్వతులు



పెనుమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పులిగుండు వద్ద ఉన్న శివాలయంలో ఉన్న పార్వతీ పరమేశ్వరులు, శివలింగం విగ్రహాలకు సోమవారం బాలాలయం ఏర్పాటు చేశారు. ఇప్పుడున్న ఆలయ స్థానంలో నూతనంగా రూ.3 కోట్ల వ్యయంతో ప్రముఖ వ్యాపారవేత్త రాకేష్‌రెడ్డి, దయాసాగర్‌రెడ్డి కుటుంబీకులు కొత్త గుడి నిర్మించనున్నారు.

తవణంపల్లె సింగిల్ విండో అభివృద్ధికి కృషి చేస్తా

● చైర్మన్ అమరేంద్ర నాయుడు



బాధ్యతలు స్వీకరించిన అమరేంద్ర నాయుడు

తవణంపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె సింగిల్ విండో అభివృద్ధికి కృషి చేస్తానని నూతన చైర్మన్ అమరేంద్రనాయుడు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అలాగే డైరెక్టర్లుగా కంపలపల్లెకు చెందిన భూపతినాయుడు, పుణ్యసముద్రానికి చెందిన మునీంద్ర కూడా బాధ్యతలు చేపట్టారు. వీరితో సింగిల్‌విండో ఇన్‌చార్జి, సూపర్‌వైజరు లక్ష్మణరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిని టీడీపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. తనది రైతు కుటుంబమని చెప్పారు. రైతులకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకుంటూ ఆదర్శ సింగిల్‌విండో తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ డైరెక్టర్ జగదీష్ నాయుడు, నాయకులు శరవణ, లోకనాథనాయుడు, చినరెడ్డెప్ప, మహదేవ నాయుడు, చైతన్య, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి

● రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్



స్వామిని దర్శించుకున్న థామస్, కూటమి నేతలు

వెదురుకుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో కుమారగిరి కొండపై ఉన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ తెలిపారు. సోమవారం సాయంత్రం స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. ఈవో కృష్ణనాయక్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అనంతరం విప్‌ను కూటమి నాయకులు సన్మానించారు.

దోమలు ప్రబలకుండా చూసుకోండి

గుడిపాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దోమలు ప్రబలకుండా చూసుకోవాలని సిబ్బందికి వైద్యశాఖ సూపర్‌వైజర్లు విజయ, చంద్రశేఖర్ సూచించారు. వసంతాపురం, బసవాపల్లెలో లార్వాల నిర్మూలన కోసం సోమవారం చర్యలు చేపట్టాలన్నారు. దోమకాటుతో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది ఉమా, కోమల, సరిత, హేమలత, సృజన, పంకజ, నిత్య పాల్గొన్నారు.

డస్ట్ బిన్లు, ఫ్యాన్ల విరాళం



పూతలపట్టు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వావిల్‌తోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డస్ట్‌బిన్లు, సీలింగ్ ఫ్యాన్లు, డెస్క్‌లను చిత్తూరుకు చెందిన ఐడీబీఐ బ్యాంకు అధికారులు సోమవారం విరాళమిచ్చారు. ఐడీబీఐ రీజనల్ మేనేజర్ శ్యామ్, బ్యాంకు మేనేజర్ వేలన్, సిబ్బంది మోహన్ బాబు, పార్తిబన్, టీచర్లు విజయభారతి, హరిబాబు, నరసింహా రెడ్డి, రవీంద్రారెడ్డి, మురళి, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



శ్రీరంగరాజపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆరిమాకుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మధు అనే విద్యార్థి షూటింగ్ బాల్ సబ్ జూనియర్స్ కేటగిరీలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం కళావతి తెలిపారు. ఈ విద్యార్థిని సోమవారం పాఠశాలలో పీటీ మాస్టర్ లోకనాథం, టీచర్లతో కలిసి అభినందించారు. ఈనెల 22 నుంచి 24వ తేదీవరకు బిహార్‌లో జరిగే పోటీలకు మన రాష్ట్రం జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని చెప్పారు.

అ'పూర్వ' కలయిక



చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):మార్గదర్శి స్కూల్‌లో 2013-14లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం తమ చదివిన బడిలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సందడి చేశారు. తెలుగు టీచర్ వెంకటేష్, రిటైర్డ్ ఎంఈవో రామ్మూర్తి నాయుడిని సన్మానించారు. స్కూల్ కరస్పాండెంట్ సుధీర్ రెడ్డి, పూర్వవిద్యార్థులు పవన్‌కళ్యాణ్, మహేష్, శివరామ్, కార్తిక్, దేవి, కావ్య, యామిని, చందన తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



బంగారుపాళ్యం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపి స్వాతంత్ర్య దినోత్సవం రోజున మంత్రి సత్యకుమార్ ద్వారా ప్రశంసాపత్రాన్ని అందుకున్న సీఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ కె.సుధాకర్‌ను సోమవారం టీడీపీ నాయకులు సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్, నాయకులు బీసీ రవీంద్రనాయుడు, ఎన్పీ రాధాకృష్ణమనాయుడు, సురేంద్రనాయుడు, రమేష్, హరిప్రసాద్,దొరబాబు, గురుస్వామి, రాజమాణిక్యం, నలగాంపల్లె శివ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం



మునీరా కుటుంబానికి రూ.లక్ష చెక్‌ను అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలం 14 కండ్రిగ ముస్లింవాడకు చెందిన ఎస్.మునీరా ఎనిమిది నెలల కిందట రాయి పనికి వెళ్లాడు. ఆ సమయంలో జరిగిన బ్లాస్టింగ్ ప్రమాదంలో రెండు కళ్లు దెబ్బతిన్నాయి. కుడిచేయి మణికట్టు వరకు తెగిపోయింది. దీనికి తోడు ఇతను పుట్టుకతో మూగవాడు. ఈ పరిస్థితుల్లో తనకు ఆర్థిక సాయం చేయాలని సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి భార్య, పిల్లలతో వచ్చి వినతిపత్రం అందజేశాడు. అతని పరిస్థితిని చూసి కలెక్టర్ సుమిత్‌కుమార్ చలించిపోయారు. సాయంత్రం వారిని తన చాంబర్‌కు పిలిపించి సొంత నిధుల నుంచి రూ.లక్షను చెక్కు రూపంలో అందజేశారు.

సంక్షిప్తంగా..

శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



బంగారుపాళ్యం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కొదలమడుగులో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. నిర్వాహకులు మునిరత్నం, శ్యామ్, బాలాజీతోపాటు టీడీపీ యువనాయకుడు పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు న్యాయం చేయండి

బంగారుపాళ్యం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు ఇచ్చి న్యాయం చేయాలని కొదలమడుగు సర్పంచు మాలతి కోరారు. సోమవారం ఎంపీడీవో మహేష్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.పంచాయతీలో 18మంది దివ్యాంగులను అనర్హులుగా ప్రకటించడం బాధాకరమని, అధికారులు పరిశీలించాలన్నారు.

యజ్ఞోపవీతం విరాళం



వెదురుకుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్వేటినగరానికి చెందిన గోవిందరెడ్డి, చంగమ్మ కుటుంబీకులు వెండి యజ్ఞోపవీతాన్ని ఆలయానికి విరాళమిచ్చారు. ఏఈవో రవికుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు సురేష్‌బాబు పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్ వితరణ

విజయపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి, మాజీ సైనికుడు కొండూరు గజేంద్ర వర్మ సోమవారం టేబుల్‌ను వితరణ చేశారు. టేబుల్‌ను హెచ్‌ఎం వెంకమరాజుకు అందించారు. విద్యాకమిటీ చైర్మన్ చినపాపయ్య, రిటైర్డు ఎంఈవో జయదేవ్‌రాజు, టీచర్ సూరలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అరకొరగా సంక్షేమ పథకాలు



సమావేశంలో పాల్గొన్న వైసీపీ నేతలు

గుడిపాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అరకొరగా సంక్షేమ పథకాలు ప్రవేశ పెడతారని వైసీపీ మండల అధ్యక్షుడు ప్రకాష్, ఎంపీపీ ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం నారగల్లు, 197రామాపురం, బొమ్మసముద్రం, నంగమంగళం పంచాయతీల్లో క్యూఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు మేనిఫెస్టో రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీదేవి, రజనీకాంత్, మధుసూదన్‌రాయల్, బాబు కారుమేఘం, అన్నపూర్ణ, చిట్టిబాబు, సంపత్ పాల్గొన్నారు.

'బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి'



ధర్నాలో పాల్గొన్న పీబీ ప్రసన్నకుమార్

బంగారుపాళ్యం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలంటూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాకు బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్య, ఎంపీ సత్యనారాయణతో కలిసి పాల్గొన్నట్లు జిల్లా అధ్యక్షులు పీబీ లక్ష్మీప్రసన్న కుమార్ సోమవారం తెలిపారు. తనవెంట సంఘ జిల్లా నాయకులు మునిరత్నం, కృష్ణమూర్తి,ఖాదర్ బాషా,అన్సర్ బాషా, చిన్న ఉన్నారన్నారు.